https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 17 సోమవారం 11-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# ఏడాది వరకూ బంగారం కొనొద్దు

## పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించండి.. మెట్రోలో వెళ్లండి



- ఇంటి నుంచి పని, ఆన్‌లైన్, వర్చువల్ భేటీలకు ప్రాధాన్యమివ్వాలి
- వంట నూనె తగ్గిస్తే దేశ సేవ.. దేహ సేవ.. విదేశాల్లో పెళ్లి, పర్యటనలొద్దు
- బెంగాల్ ఉత్సాహం ఇక్కడా కనిపిస్తోంది..
- తెలంగాణలోనూ వచ్చేది బీజేపీనే
- కాంగ్రెస్ మిగిలింది 3 రాష్ట్రాల్లోనే..
- అబద్ధపు హామీలతో అధికారంలోకి
- కాంగ్రెస్ కాదది ఎంఎంసీ.. అంటే ముస్లింలీగ్ మావోవాదీ కాంగ్రెస్
- పరేడ్ గ్రౌండ్ సభలో ప్రధాని మోదీ..

హైదరాబాద్, మే 10
యుద్ధాలతో ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం, ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయని.. భారత్‌పైనా తీవ్ర ప్రభావం పడుతోందని.. ఈ తరుణంలో దేశం కోసం మనందరం కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు! పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని.. మెట్రో రైలు సౌకర్యం ఉన్న నగరాల్లో ప్రజలుదాన్ని వినియోగించుకోవాలని.. కారులో వెళ్లాల్సి వస్తే కార్ పూల్ చేసి ఇతరులనూ తీసుకెళ్లాలని సూచించారు. ఏడాదిపాటు ఎవరూ బంగారం కొనొద్దని.. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని హితవు పలికారు. వస్తు రవాణా కోసం రైలు సేవలు వినియోగించుకోవాలన్నారు. రైళ్లు కరెంటుతో నడుస్తాయి కాబట్టి వాటికి పెట్రోల్, డీజిల్ అవసరం ఉండదని గుర్తుచేశారు. ఇరాన్ యుద్ధం మొదలయ్యాక ప్రధాని మోదీ ఇంధనం, ఎరువుల కొరతతోపాటు యుద్ధం వల్ల కలుగుతున్న పలు సమస్యలపై బహిరంగంగా ప్రస్తావించి, ప్రజలకు జాగ్రత్తలు చెప్పడం ఇదే తొలిసారి. రాష్ట్రపర్యటనలో ఉన్న ఆయన.. ఆదివారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తూ ఈ జాగ్రత్తలు చెప్పారు. "నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా.. మీ అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు" అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ.. రాజకీయ విమర్శలు చేయడంతోపాటు, దేశ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. కరోనా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో సమస్యలు పెరిగాయని.. అయినప్పటికీ వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక యూరియా బస్తా అంతర్జాతీయంగా రూ. 3వేల ధర ఉంటే.. భారత్‌లో అదే రూ. 300 కంటే తక్కువగా వస్తోందని గుర్తుచేశారు. అయితే, మన చుట్టుపక్కల జరుగుతున్న (ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్) యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా సమస్యలు మరింతగా పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. "యుద్ధ ప్రభావం మనపై తీవ్రంగా పడుతోంది. మనవద్ద పెట్రోల్ బావులు లేవు. ఇతర దేశాలపై ఆ?ధారపడుతున్నాం. యుద్ధంతో ప్రపంచం అంతా పెట్రోలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ సమస్య నుంచి ప్రజలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలపై భారం వేయకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే భరిస్తోంది. సరఫరా గొలుసు (సప్లై చైన్ల) ఇబ్బందులతో.. విదేశీమారక ద్రవ్యం ఎక్కువగా ఖర్చవుతోంది. దీనిపై మనమంతా కలిసి పోరాడాలి. దేశం కోసం ప్రాణాలు ఇవ్వడమే దేశభక్తి కాదు.. దేశం కోసం బతకడం, దేశ కర్తవ్యం కోసం పాటుపడటం కూడా దేశభక్తే" అని ఆయన పేర్కొన్నారు.

**నూనె తగ్గించడమూ..**
పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలంటే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్, వర్చువల్ మీటింగ్‌లకు ప్రాధాన్యమివ్వాలని ప్రధాని సూచించారు. అలాగే.. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేయాలన్నారు. మంచి నూనె, బంగారం వంటివాటి కొనుగోలుకు విదేశీ మారక ద్రవ్యం ఎక్కువగా ఖర్చవుతోందని గుర్తుచేశారు. "మంచి నూనె వాడకం తగ్గించినా అది దేశభక్తి అవుతుంది. దేశసేవతోపాటు దేహ సేవ. దీంతో దేశ ఆర్థికవ్యవస్థతోపాటు కుటుంబ ఆరోగ్యం కూడా మెరుగవుతుంది" అని వ్యాఖ్యానించారు. "గతంలో యుద్ధం వచ్చినప్పుడు, ఏదైనా సంకటం వచ్చినప్పుడు ప్రజలు దేశం కోసం బంగారం ఇచ్చేవారు. ఇప్పుడలా బంగారం దానం చేయాల్సిన అవసరం లేదుగానీ.. దేశ ప్రయోజనాల నిమిత్తం ఏడాది వరకూ.. ఇంట్లో ఏ శుభకార్యమైనా సరే.. బంగారం కొనకూడదని నిర్ణయం తీసుకోండి. దీంతో విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది" అని సూచించారు. గతంలో మన దేశం రాగిని ఎగుమతి చేసేదని.. ఇప్పుడు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ధర్నాలు, ఆందోళనలతో కాపర్ ప్లాంట్లు మూతపడడమే అందుకు కారణమన్నారు. ఇప్పుడు రాగి దిగుమతుల కోసం విదేశీ మారకద్రవ్యాన్ని ఎక్కువగా వినియోగించాల్సి వస్తోందన్నారు. విదేశాల్లో పెళ్లిళ్లు, పర్యాటకాన్ని ఏడాదిపాటు వాయిదా వేసుకోవాలన్నారు. దేశంలో పర్యాటక ప్రాంతాలు చాలానే ఉన్నాయని.. ఇక్కడ కూడా పర్యటించవచ్చని పేర్కొన్నారు.

## అగ్ని-5 క్షిపణి ప్రయోగంలో భారత్ విజయవంతం

**ఒకే క్షిపణితో బహుళ లక్ష్యాల ఛేదన**

**ఎంఐఆర్వీ సాంకేతికతతో రక్షణ సామర్థ్యానికి బలం**

**డీఆర్డీవో, సైన్యాన్ని అభినందించిన రాజ్‌నాథ్ సింగ్**



న్యూఢిల్లీ, మే 10
భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అత్యాధునిక ఎంఐఆర్వీ సాంకేతికతతో రూపొందించిన అగ్ని-5 క్షిపణి ప్రయోగాన్ని భారత్ విజయవంతంగా నిర్వహించింది. ఒకే క్షిపణి ద్వారా ఏకకాలంలో పలు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని ఈ పరీక్ష మరోసారి నిరూపించింది. ఈ విజయంతో దేశ రక్షణ సామర్థ్యం మరింత బలపడిందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మే 8న ఈ ప్రయోగాన్ని చేపట్టారు. 'మిషన్ దివ్యాస్త్ర'లో భాగంగా నిర్వహించిన ఈ పరీక్షలో అగ్ని-5 క్షిపణి హిందూ మహాసముద్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న బహుళ లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గత ఏడాది మార్చిలో కూడా ఇదే సాంకేతికతతో తొలి విజయవంతమైన పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఎంఐఆర్వీ సాంకేతికత ద్వారా ఒకే క్షిపణిలో పలు వార్‌హెడ్‌లను అమర్చి, వాటిని వేర్వేరు లక్ష్యాలపైకి పంపే అవకాశం ఉంటుంది. దీంతో ఒకే సమయంలో అనేక లక్ష్యాలను దాడి చేసే సామర్థ్యం లభిస్తుంది. ప్రపంచంలో అత్యాధునిక క్షిపణి సాంకేతికత కలిగిన కొద్ది దేశాల్లో మాత్రమే ఈ సామర్థ్యం ఉంది. తాజా విజయంతో భారత్ కూడా ఆ జాబితాలో తన స్థానాన్ని మరింత బలపరిచింది. క్షిపణి ప్రయోగం నుంచి లక్ష్యాల ఛేదన వరకు మొత్తం ప్రయాణాన్ని భూమి, నౌకల ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా పర్యవేక్షించారు. ఫ్లైట్ డేటా ఆధారంగా అన్ని నిర్దేశిత లక్ష్యాలు విజయవంతంగా నెరవేరినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ప్రయోగ సమయంలో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు, భారత సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీవో శాస్త్రవేత్తలు, సైన్యం, పరిశ్రమ భాగస్వాములను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో ఈ సాంకేతికత దేశానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అగ్ని-5 క్షిపణి సుమారు 5 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం కలిగి ఉంది. ఈ తాజా ప్రయోగంతో భారత రక్షణ వ్యవస్థ మరింత ఆధునిక స్థాయికి చేరిందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అసోం సీఎంగా రేపు హిమంత ప్రమాణ స్వీకారం



గువాహటి, మే 10:
అసోం ముఖ్యమంత్రిగా బీజేపీ, ఎన్డీయే పక్ష నేత హిమంత బిశ్వ శర్మను గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య నియమించారు. అంతకుముందు బీజేపీ శాసనసభాపక్ష నేతగా, ఎన్డీయే పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాక తనకు మద్దతిస్తోన్న ఎమ్మెల్యేల జాబితాతో శర్మ లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ ఆయనకు ఆహ్వానం పలికారు. అసోంలో ఎన్డీయే ప్రభుత్వం వరుసగా మూడోసారి కొలువుతీరనుంది. ఖానాపారాలో మంగళ వారం జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు పలువురు సీఎంలు హాజరుకానున్నారు.

## బాబు ఇంట మోదీ

**లోకేశ్‌తో కలిసి రాజకీయ చర్చలు..**

**గంటా పది నిమిషాలు మంతనాలు**

**తెలంగాణ, ఏపీ రాజకీయాలపై ప్రధాన చర్చ**

**ప్రధానితో సమావేశం.. మాకెంతో ప్రత్యేకం: సీఎం**




హైదరాబాద్, మే 10
ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. తెలంగాణ, ఏపీ రాజకీయాలపై చర్చించుకు న్నారు. ఈ భేటీలో మంత్రి లోకేశ్ కూడా పాల్గొన్నారు. ఆదివారం హైదరాబాద్ వచ్చిన ప్రధాని.. సాయంత్రం 5.15 గంటలకు జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. దాదాపు గంటా పది నిమిషాలకు పైగా అక్కడే ఉన్నారు. ముఖ్యంగా తెలంగా ణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఉభయులూ చర్చించారు. ఏపీలో ఎన్డీఏ భాగస్వాముల మధ్య ఉన్న సాన్నిహిత్యం.. తెలంగాణలో కూడా ఎలా ప్రతిబింబింప జేయాలో మాట్లాడుకున్నారు. 'పొత్తుల అంశం వరకు వెళ్లకున్నా.. తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఉన్న టీడీపీ అభిమానులను ఏ విధంగా బీజేపీ వైపు మళ్లించాలి.. త్వరలో హైదరాబాద్ పరిధిలో రాబోయే మూడు కార్పొరేషన్ల ఎన్నికలు.. ఆ తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి' అన్నదానిపై చర్చ జరిగి ఉంటుందని బీజేపీ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. మరోవైపు ఏపీలో అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమలూ ఇద్దరి మధ్య చర్చకొవచ్చాయి. ఇరాన్ యుద్ధ పరిణామా లపైనా మాట్లాడుకున్నారు. అంతకుముందు.. తమ నివాసానికి వచ్చిన ప్రధానికి సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా స్వాగతం పలికారు. ఇంట్లోకి వెళ్లగానే పూజామంది రంలోని సీతారాములకు ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రబా బు, ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారు డు దేవాంశ్‌లను మోదీ ఆప్యాయంగా పలుక రించారు. దేవాంశ్ భుజాలపై చేయి వేసి, మాట్లాడుతూ ముందుకు కదిలారు. తెలుగు వంటకాలతో నారా కుటుంబం ఇచ్చిన తేనీటి విందును స్వీకరించారు. అనంతరం వెంకటగిరి చేనేత కళాకారులు జామ్దానీ నేతతో తయారుచేసిన శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

## తమిళనాడు సీఎంగా 'ఇళయదళపతి'

**విజయ్‌తో పదవీప్రమాణం చేయించిన గవర్నర్ రాజేంద్ర అర్లేకర్**

**బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జున, సెంగోట్టయ్యన్, కీర్తన సహా 9 మంది మంత్రులతో కూడా..**




చెన్నై, మే 10
తమిళనాట ఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలనకు తెరపడింది. రాష్ట్రంలో 59 ఏళ్ల తర్వాత తొలిసారి ద్రవిడ పార్టీయేతర ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు.. 'ఇళయదళపతి' జోసెఫ్ విజయ్ ఆదివారం ఉదయం చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేశారు. వేల మంది సినీ అభిమానులు, పార్టీ శ్రేణులు, పార్టీ ప్రముఖులు, కార్యకర్తల హర్షధ్వానాల నడుమ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆయనతో పదవీప్రమాణం చేయించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా హాజరయ్యారు. వేదికపై విజయ్‌కి కుడివైపు ఆయన, గవర్నర్ ఎడమవైపు ఆశీనులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయికుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి అనుమతి ఇవ్వాలని కోరగా.. గవర్నర్ అంగీకారం తెలిపారు. ఆ తర్వాత గవర్నర్, విజయ్ మైకుల ముందు నిలిచారు. విజయ్.. 'జోసెఫ్ విజయ్ ఎనుమ్ నాన్ (జోసెఫ్ విజయ్ అనే నేను) అని అనగానే స్టేడియం కరతాళ ధ్వనులు, ఈలలతో ప్రతిధ్వనించింది. ప్రమాణస్వీకారం మొదటి భాగాన్ని ఆయన కంఠస్థం చేసుకుని వచ్చారు. హావభావాలతో చేతులు పైకెత్తి, పిడికిలి బిగించి బిగ్గరగా చదివారు. రెండోభాగాన్ని చదివేందుకు సిద్ధమవుతుండగా.. ప్రతిని చూసి మిగతా సగభాగం ప్రమాణం చేయాలని గవర్నర్ సూచించారు. ఆ ప్రకారమే విజయ్ ప్రతిని చేతపట్టుకుని ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. ఆ తర్వాత వరుసగా మరో 9 మంది.. బుస్సీ ఎస్.ఆనంద్, ఆదవ్ అర్జునా, కేఏ సెంగోట్టయ్యన్, ఎస్.కీర్తన, కేజీ అరుణ్‌రాజ్, పి.వెంకటరమణన్, సీఆర్ నిర్మల్‌కుమార్, రాజ్‌మోహన్, టీకే ప్రభుతో గవర్నర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. ఈ వేడుకలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీపీఎం నేత షణ్ముగం, సీపీఐ నేత వీరపాండ్యన్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, ఆ పార్టీ మహిళా నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, వీసీకే, ఐఎంయూఎల్ నేతలు కూడా పాల్గొన్నారు. మాజీ సీఎంలు స్టాలిన్, పళనిస్వామి రాలేదు. అలాగే విజయ్ భార్య సంగీత, ఆయన కుమారుడు, కుమార్తె కూడా హాజరుకాలేదు.

**మూడు ఫైళ్లపై తొలి సంతకాలు..**
పదవీప్రమాణం చేసిన నెహ్రూ స్టేడియం వేదికపైనే సీఎం విజయ్ కీలకమైన మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సబ్సిడీ పథకంపై తొలి సంతకం.. మహిళల భద్రతకు కల్పించే దిశగా 'సింగపెణ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు ఫైలుపై రెండో సంతకం.. మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా మాదక ద్రవ్యాల నిరోధక దళం(యాంటీ-నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్) ఏర్పాటుకు సంబంధించిన ఫైల్‌పై మూడో సంతకం చేశారు. స్టేడియంలో ప్రమాణస్వీకారం ముగిసిన తర్వాత విజయ్ సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత సీఎం చాంబర్లోకి వెళ్లి ముఖ్యమంత్రి కుర్చీలో ఆశీనులై బాధ్యతలు స్వీకరించారు. కొన్ని ఫైళ్లపై సంతకాలు చేశారు. కాగా.. విజయ్‌కు ప్రత్యేక కార్యదర్శులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులు సెంథిల్‌కుమార్, లక్ష్మీప్రియ నియమితులయ్యారు.

**విజయ్ తల్లిదండ్రుల ఆనంద బాష్పాలు**
విజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం చూసి ఆయన తండ్రి, సినీ దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్, తల్లి, ప్రముఖ గాయని శోభా చంద్రశేఖర్ భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. జోసెఫ్ విజయ్ అనే నేను అని విజయ్ పలుకగానే ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేకపోయాయి. కాసేపు ఇరువురూ కళ్లు మూసుకుని ధ్యానం చేశారు. తర్వాత విజయ్ ప్రసంగిస్తూ.. తాను సాధారణమైన సినీ అసిస్టెంట్ డైరెక్టర్ కుటుంబం నుండి వచ్చానని అన్నప్పుడు కూడా ఆ దంపతులు ఉద్వేగానికి గురయ్యారు.

## రెండేళ్ల తర్వాత యోగి క్యాబినెట్ విస్తరణ..

లక్నో:
ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదివారంనాడు చేపట్టారు. ఆరుగురు కొత్త మంత్రులను తన క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. లక్నోలోని జన్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రుల చేత గవర్నర్ అనందిబెన్ పటేల్ ప్రమాణస్వీకారం చేయించారు. ఉత్తరప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు భూపేంద్ర సింగ్ చౌదరి, బీజేపీ నేత మనోజ్ కుమార్ పాండేలు యోగి క్యాబినెట్‌లో కొత్తగా చేరారు. మనోజ్ పాండే ఇటీవలే సమాజ్‌వాదీ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. కృష్ణ పాశ్వాన్, సురేంద్ర దిలేర్, హన్సరాజ్ విశ్వకర్మ, కైలాష్ సింగ్ రాజ్‌పుత్ సైతం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్‌లకు పదోన్నతి కల్పించారు. స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రులుగా వీరిని నియమించారు. యోగి 2.0 ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రివర్గ విస్తరణ చేపట్టడం ఇది రెండోసారి. మార్చి 2024లో మొదటిసారి మంత్రివర్గ విస్తరణ జరిపారు. 2027లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తాజాగా మరోసారి మంత్రివర్గ విస్తరణను యోగి ఆదిత్యనాథ్ చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఘనంగా మదర్స్ డే వేడుకలు



**రామకృష్ణాపూర్, మే 10, (మన సమాజం):**
పట్టణంలోని 21వ వార్డు భగత్ సింగ్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే వేడుకలను ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ పార్వతి విజయ వార్డులోని మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించి మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మహంకాళి శ్రీనివాస్, పార్వతి విజయ మాట్లాడుతూ సృష్టికి మూలమైన మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని పేర్కొన్నారు . జన్మనిచ్చిన తల్లిని వృద్ధాప్య సమయంలో కన్న బిడ్డల వలె చూసుకోవాలని కుమారులకు సూచించారు. తల్లిదండ్రులను పట్టించుకోకుండా వృద్ధాశ్రమం, అనాధాశ్రమాలలో చేర్పించే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, నరసింహం, తిరుపతి, మహిళలు పాల్గొన్నారు.

## రైతులను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**ధాన్యం కొనుగోలు విషయంలో పూర్తి నిర్లక్ష్యం**

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**




**రామకృష్ణాపూర్, మే 10, (మన సమాజం):**
రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో అరెస్ట్ అయిన బాల్క సుమన్ ఆదివారం పోలీస్ స్టేషన్ లో సంతకానికి హాజరై మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వహిస్తుందన్నారు. రైతులు ఒకపక్క అరిగోస పడుతుంటే రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ప్రమాధంలో మృతి చెందిన రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపి మూలాఖత్ అయిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఇటీవల ఓ ప్రజాప్రతినిధి కేసు విషయంలో జరిగిన పరిణామాలనే ఉదాహరణగా చెప్పుకొచ్చారు. ఆయన వెంట ఛైర్మెన్ సద్యారాణి, పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్, నాయకులు మూల రాజిరెడ్డి, మేడిపల్లి సంపత్, మాజీ కౌన్సిలర్లు అనిల్ రావు, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### తెలంగాణ మాండలికంతో, చేనేత నేపథ్యంలో

## పోరంకి నవల 'ముత్యాల పందిరి'

"అ న్నీ నేనే మొదట రాశాను" అని చెప్పుకోవడం దాశరథి రంగాచా ర్యకు అలవాటు. 'చిల్లర దేవుళ్ళు' నవలతో తొలి తెలంగాణ మాండలిక నవల రాసింది కూడా తానేనని ఆయన ఇంటర్వ్యూలలో, సభలలో బాహాటంగా చెప్పుకు న్నారు. చదివే ఓపిక, పరిశోధించే తీరిక లేని విమర్శకులు రంగాచార్య మాటలనే వేదవాక్కుగా భావించి దాన్ని బలపరుస్తూ వ్యాసాలు రాసేశారు. దాశరథి రంగాచార్య కంటే ముందు, అనగా 1964 లోనే పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాల పందిరి' పేరిట తెలంగాణ మాండలికంలో నవల రాయడం, అదే సంవత్సరం ఆంధ్రప్రభ ఉగాది నవలల పోటీలో అది మూడవ బహుమతి పొందడం జరిగింది. ఆంధ్రప్రభలో 1964లో సీరియ ల్‌గా వచ్చిన ఈ నవల, 1968లో ఎమెస్కో పాకెట్ బుక్‌గా వచ్చింది. రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' కూడా 1970లో ఎమెస్కో పాకెట్ బుక్స్ లోనే వచ్చింది. తర్వాత జరిగిన పరిశోధనలలో, 1955లోనే లోక మలహరి రాసిన 'జెగ్గని యిద్దె' అనే నవల తెలంగాణ మాండలికంలో వచ్చిందని తేలింది. కాబట్టి తెలంగాణ మాండలికంతో వచ్చిన నవలల్లో రెండవ నవల 'ముత్యాల పందిరి' కాగా, మూడవది మాత్రమే దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు'. ఆ తర్వాత మాదిరెడ్డి సులోచన 'తరం మారింది' నవల వచ్చింది. మాండలిక వృత్తి పదకోశాల నిర్మాణంలో భాగంగా క్షేత్ర పర్యటన చేసి, మాండలిక పదాలను సేకరించిన పరిశోధకుడిగా పోరంకి దక్షిణామూర్తి మాండలికాల మీద విపరీతమైన ఆసక్తిని పెంచుకు న్నారు. దాంతో వివిధ మాండలి కాల మీద నవలలు రాయాలని సంకల్పించి ముందుగా తెలంగాణ మాండలికంలో 'ముత్యాల పందిరి', తర్వాత కోస్తా మాండలికంలో 'వెలుగు వెన్నెల గోదారి', రాయలసీమ మాండలికంలో 'రంగవల్లి' నవలలు రాసి రికార్డు సృష్టించారు. సృజనాత్మక రచయి తగా, క్షేత్ర పర్యటనలతో చేనేత పని వారి జీవన విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం వల్ల, అదే నేపథ్యంగా తీసుకుని 'ముత్యాల పందిరి' నవలను రూపొందించారు. ఇందులో చేనేత పని వారి కుటుం బంలో జన్మించిన చంద్రయ్యకు నేత పని ఇష్టం లేక, చదువుకోవడానికి బడికి వెళుతుంటాడు. ధనవం తుడైన మేనమామ లచ్మయ్య కూతురు ముత్యాలుతో ఆటపాట లతో అన్యోన్యంగా మెసలుతాడు.

# ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

**చైర్మెన్ సంధ్యారాణి..**






**రామకృష్ణాపూర్, మే 10, (మన సమాజం):**
ఆరోగ్యంపై ప్రజలందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్మన్ గోడిసెల సంధ్యారాణి-రాజారమేష్ సూచించారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ హైదరాబాద్ సౌజన్యంతో స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

చైర్మన్ సంధ్యారాణి వైద్యులతో కలిసి శిభిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవ జీవన శైలిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య వెద్య పరీక్షలు చేయించుకోవడం క్షేమం అన్నారు. వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వైద్యాన్ని అందించడం అభినందనీయం అన్నారు. మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన పద్మశాలి సంఘం సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిభిరాన్ని సుమారు 200 మంది వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత-శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు వనం సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ ఆడెపు తిరుపతి, కోశాధికారి వెంకటేశ్, సభ్యులు లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, హరిప్రసాద్, కుమార్, వైద్యులు చందన్, సిసిర్, ఆఫ్రాన్, స్థానిక కౌన్సిలర్ కృపానందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల మనసు కమ్యూనిస్టులకు తెలియదు!



స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ 'ఒకే భారతదేశం' అనే జాతీయ భావనను ప్రజల్లో రగిలించి, బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడేలా వారిని పురిగొల్పారు. సామ్యవాదులు, కమ్యూనిస్టులు సహా వివిధ రాజకీయ శక్తులను ఏకతాటిపైకి తెచ్చి, ఎన్నికల ఆధారిత ప్రజాస్వామ్యానికి నెహ్రూ నాంది పలికారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన జాతీయ భావనతో కమ్యూనిస్టులు విభేదించారు. గాంధేయ జాతీయవాదానికి, నెహ్రూ అనుసరించిన వ్యూహానికి ప్రత్యామ్నాయం రూపొందించడం ఎం.ఎన్.రాయ్, ఎస్.ఏ. డాంగే, పి.సి.జోషి, ఆర్.పి.దత్‌లకు కష్టసాధ్యమైంది. ఒకవైపు జాతీయవాదం క్రమంగా బలపడుతున్న తరుణంలో, దానికి ప్రత్యామ్నాయంగా రైతు-- కార్మిక రాజకీయాలను కమ్యూనిస్టులు ప్రతిపాదించారు. కాంగ్రెస్ పాలన మొదలైన వెంటనే, నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయాలని వారు ఉవ్విళ్లూరారు. పశ్చిమ యూరప్, రష్యా అనుభవాల ప్రభావంతో దేశంలో నెహ్రూ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని చేపట్టి, రాజులను తన పాలనలో భాగస్వాములుగా చేసుకున్నారు. అనంతరం భూ సంస్కరణల కమిషన్‌ను ఏర్పాటు చేసి, రైతు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. తత్ఫలితంగా, జమీందార్లు, భూస్వాముల స్థానంలో రైతులు భూ యజమానులయ్యారు. వారు పంటలు పండించి అమ్మడంతో వ్యవసాయం కొత్త దశలోకి మళ్లింది. అదే ఆధునిక ఆర్థిక వ్యవస్థకు పునాది అయింది. 'దున్నే వాడిదే భూమి' అనే కమ్యూనిస్టుల ప్రాథమిక నినాదాన్ని నెహ్రూ తమ పాలనలో ఆచరిస్తూ, ఆ పార్టీని బలహీనపరిచారు. కమ్యూనిస్టులు ఈ ధోరణులను అర్థం చేసుకున్నారా? లేదు. నిజానికి, నెహ్రూ అమలు చేసిన వ్యవసాయ విధానానికి ప్రత్యామ్నాయంగా కార్మిక వర్గాన్ని సంఘటితం చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టుల మీద ఉంది. కానీ వారు అలా చేయలేదు. అంతేకాదు, శూద్రుల్లోని ఉన్నత రైతు వర్గం కాంగ్రెస్‌లో భాగమవుతున్నప్పుడు, కమ్యూనిస్టులు కనీసం ఆ వర్గంలోని కింది కులాలనైనా తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించాల్సింది. అదీ చేయలేదు. కమ్యూనిస్టులు ప్రధానంగా రైతు కులాల నుంచి వచ్చినవారు కావడంతో రైతు ప్రయోజనాలు దాటి, వ్యవసాయ కూలీ-- దళిత రాజకీయ దృష్టిని అభివృద్ధి చేసుకోలేకపోయారు. చట్టాల ద్వారా ఎప్పుడో అమలైన వ్యవసాయ విప్లవాన్నే (ఇప్పటికీ జరగలేదన్నట్లుగా) కమ్యూనిస్టు పార్టీలన్నీ ఇంకా డిమాండ్ చేస్తూనే ఉన్నాయి! భూ సంస్కరణలతో బలపడిన రైతు కులాలు, అనంతర కాలంలో సొంత ప్రాంతీయ పార్టీలను స్థాపించి రాజకీయ శక్తులుగా ఎదిగాయి. ఈ దశలో ఇందిరాగాంధీ, రైతు రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా దళితులను, క్రింది కులాల అజెండాను ముందుకు తెచ్చారు. దాంతో కమ్యూనిస్టులకు స్పష్టమైన రాజకీయ అజెండా మిగలకుండా పోయింది. వ్యవసాయ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఏర్పడిన రైతు కూలీ, దిగువ కులాల ఐక్యతను వారు ఇప్పటికీ గుర్తించలేదు! నా ఉద్దేశం ప్రకారం, భారతీయ సమాజంలో వచ్చిన చైతన్యాన్ని కమ్యూనిస్టులు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. ఈ దేశంలో కులవ్యవస్థే ప్రధాన పాత్ర పోషిస్తున్నదన్నది నిజం. గతంలో బ్రిటిషర్ల వలస పాలన, స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా కులాన్ని ఆధారంగా చేసుకొని ఏర్పడినవే. పెట్టుబడిదారీ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి శూద్రులే వెన్నెముకగా నిలిచారు. ఇక, కమ్యూనిస్టులకు ప్రత్యామ్నాయం-- దిగువ కులాల ఆధారంతో సామాజిక న్యాయం ప్రాతిపదికన ప్రజాస్వామ్యాన్ని స్థాపించడం. ఇక్కడే అసలు సమస్య. భారతదేశంలో రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, సామాజిక నిర్మాణం... వీటన్నింటినీ నిర్ణయించే ప్రధాన అంశం 'కులమే' అయినప్పటికీ, ఆ పదాన్ని తమ విధానాల్లో ఉపయోగించడానికి కమ్యూనిస్టులు సంకోచించారు. కుల వాస్తవికతను అర్థం చేసుకోవడంలో వారు విఫలమయ్యారు. క్రమంగా వామపక్ష పార్టీల్లో చీలికలు మొదలై, ఆ పార్టీలు మరింతగా బలహీనపడ్డాయి. 1940-50 దశకంలో ప్రభుత్వాన్ని నడపడానికి లౌకిక-మతవాద రాజకీయాలు నెహ్రూకు రాజకీయ అవసరంగా మారాయి. దేశ విభజన సమయంలో అల్లర్లకు కారణమైన హిందుత్వ శక్తులను నెహ్రూ తన మతతత్వ వ్యతిరేక విధానం ద్వారా ఒంటరిని చేశారు. తొలుత హిందూ మహాసభ, అనంతర కాలంలో జనసంఘ్ అభివృద్ధి చేసిన హిందూ ఆధిపత్య రాజకీయాలను పక్కకు నెట్టి, మతభేదం లేకుండా అందరికీ ప్రజాస్వామ్య పాలనను అందించడానికి ఆయన కృషి చేశారు. దీంతో కమ్యూనిస్టులు సైతం సెక్యులరిజానికి మౌన అనుచరులుగా మారాల్సి వచ్చింది. ప్రారంభంలో రణదివే, రాజేశ్వరరావు లాంటి ప్రముఖ కమ్యూనిస్టు నేతలు నెహ్రూ విధానాలను గుడ్డిగా వ్యతిరేకించారు. కానీ నెహ్రూ రాజకీయాలకు దీటుగా తమ రాజకీయ విధానాలను రూపొందించుకోవడంలో విఫలమయ్యారు. దీంతో క్రమంగా వారు కూడా నెహ్రూవియన్ కమ్యూనిస్టులుగా మారిపోయారు! ఎమర్జెనీ కాలంలో హిందుత్వ రాజకీయ అజెండా మళ్లీ తెరపైకి వచ్చింది. జనసంఘ్ అనంతర కాలంలో బీజేపీగా మారి మతవాద రాజకీయాలను ముందుకు తెచ్చింది. అప్పటికే ఏర్పడిన రాజకీయ శూన్యతను క్రమంగా తనకనుకూలంగా మలుచుకుంటూ 2014లో అధికారాన్ని చేజిక్కించుకుంది. ప్రజలకు మతం ఒక విశ్వాసం. కానీ మతతత్వవాదం అనేది పక్కాగా రాజకీయం. ప్రజలకు ఈ విషయంలో పూర్తి స్పష్టత ఉంది. ప్రజల మనస్తత్వాన్ని కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాలి. నేటికీ భారతీయులు తమ పండుగలతో పాటు పెళ్లిళ్లు, చావులకు సంబంధించిన తంతులన్నింటినీ వారి మతాచారాల ప్రకారంగానే జరుపుకుంటున్నారు. అయినప్పటికీ ప్రజలు స్వభావరీత్యా మతవాదులు కారు. వారు బీజేపీకి ఓటు వేయడానికి హిందూత్వం ఎంతమాత్రం కారణం కాదు. ప్రజల దృష్టిలో మతమనేది మోక్ష సాధనం మాత్రమేగానీ రాజకీయ సాధనం ఏమాత్రం కాదు. నిజానికి దేశంలో సరళీకరణ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి బాగా పెరిగిపోయింది. ఈ అవినీతి, కుల రాజకీయాలపై ప్రజలు విరక్తి చెందారు. బీజేపీ అధికారంలోకి రావడానికి ఈ అంశాలే దోహదం చేశాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ తన పరువును కాపాడుకోవడానికి మతతత్వవాదం అనే ఎత్తుగడను తెరపైకి తెచ్చింది. అయితే, ఈ రాజకీయ మార్పును కూడా కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేకపోయారు. హిందుత్వ నినాదం నగరాల్లో మాత్రమే ప్రభావం చూపగలదని బీజేపీకి తెలుసు. అందుకే, ప్రాంతీయ రాజకీయాల్లో మతపరమైన అంశాల కంటే ఇతర అంశాలపైనే వారు అధిక దృష్టి పెట్టారు. నేడు వీలైనంతగా తటస్థ రాజకీయాలను అవలంబిస్తూ, ముస్లింల మద్దతు కోసమూ ప్రయత్నిస్తున్నారు. ఇక, తెలంగాణలో ఏ ధోరణిని అనుసరించాలో బీజేపీకి ప్రస్తుతం అర్థం కాకుండా ఉంది. ఇప్పటికే రాజకీయంగా అభివృద్ధి చెందిన రెడ్డి సామాజికవర్గాన్ని ఆధారంగా చేసుకుని పార్టీని నిర్మించాలా, లేక ఎగిసిపడుతున్న బీసీ అజెండాను తలకెత్తుకోవాలో తెలియని సందిగ్ధ స్థితిలో ఉంది. ఏదేమైనా రాష్ట్ర కమలదళం హిందుత్వ అజెండాను మాత్రం తెరపైకి తీసుకురావాలనుకోవడం లేదు. అలాంటి మతవాదాన్ని ప్రజలు ఆదరించరని బీజేపీకి తెలుసు. అందుకే కాంగ్రెస్ కూడా ప్రస్తుతం సామాజిక న్యాయం అనే అజెండాను అనుసరిస్తోంది. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వేడుకల్లో వామపక్ష నేతలు మాట్లా డుతూ, బీజేపీ హిందుత్వ వాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కానీ ప్రజల మనసులో ఏముందో మాత్రం వారు గుర్తించడం లేదు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర కావాలని కోరుకుంటున్నారు. కానీ రైతు, కార్మిక సమస్యలపై కూడా కమ్యూనిస్టులు దృష్టి సారించడం లేదు. పట్టణ కార్మికవర్గం ఇప్పటికే పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగమైంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల్లో వచ్చిన రాజకీయ చైతన్యం నేడు పాలక పార్టీలను కుదిపేస్తోంది.

# విజయ్ ప్రమాణ స్వీకార వేడుకలో త్రిష సందడి

**చెన్నైలో ఘనంగా జరిగిన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం**

**అభిమానులతో కిక్కిరిసిన జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం**

**కార్యక్రమానికి హాజరైన రాహుల్ గాంధీ**



**చెన్నై, మే 10**
తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేడుక ఘనంగా జరిగింది. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలతో స్టేడియం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి త్రిష హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె రాకతో అభిమానులు ఉత్సాహం వ్యక్తం చేశారు. సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొని విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. విజయ్ రాజకీయ ప్రయాణానికి మద్దతుగా పలువురు జాతీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కు అభిమానులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తక్కువ కాలంలోనే ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## కర్ణాటక మంత్రి డి. సుధాకర్ కన్నుమూత

**అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస**

**నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన నేత**

**సుధాకర్ మృతిపై రాజకీయ నేతల సంతాపం**

**బెంగళూరు, మే 10:**



కర్ణాటక ప్రణాళిక, గణాంకాల శాఖ మంత్రి డి. సుధాకర్ ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బెంగళూరులోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఉదయం 3:15 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ఆస్పత్రి వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఆయన మృతి కర్ణాటక రాజకీయ వర్గాల్లో విషాదాన్ని నింపింది. కొద్ది రోజుల క్రితం మోకాలి శస్త్రచికిత్స కోసం మణిపాల్ ఆస్పత్రిలో చేరిన సుధాకర్‌కు శస్త్రచికిత్స అనంతరం ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకింది. దీంతో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏప్రిల్ 20న కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆయన లైఫ్ సపోర్ట్‌పై చికిత్స పొందుతున్నారు. ఊపిరితిత్తుల మార్పిడి కోసం వైద్యులు సన్నాహాలు చేస్తున్న సమయంలోనే ఆయన మరణించడం కుటుంబ సభ్యులు, అనుచరులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. చిత్రదుర్గ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించిన సుధాకర్ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ను తన రాజకీయ గురువుగా భావించేవారు. వారిద్దరి మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగాయి. మొత్తం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సుధాకర్, 2008లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి హిరియూరు నియోజకవర్గం నుంచి 2013, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. మంత్రి సుధాకర్ మృతి పట్ల డీకే శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన సన్నిహితుడు, మంత్రివర్గ సహచరుడి మరణం తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. కర్ణాటక ప్రతిపక్ష నేత ఆర్. అశోక కూడా సుధాకర్ మృతిపై సంతాపం తెలిపారు. సుధాకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మరణంతో కర్ణాటక రాజకీయాల్లో ఒక కీలక నాయకుడిని కోల్పోయామని పలువురు రాజకీయ ప్రముఖులు పేర్కొంటున్నారు.

# డీజీపీ కార్యాలయం ముట్టడించిన బీఆర్ఎస్వీ నేతలు

**బండి భగీరథపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**బాధిత కుటుంబాన్ని వేధించిన అధికారులపై విచారణ కోరిన గెల్లు శ్రీనివాస్**

**కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై విమర్శలు**

**హైదరాబాద్, మే 10**
మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటూ పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథపై చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ బీఆర్ఎస్వీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంను ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకు నాయకత్వం వహించిన బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, కేసులో నిందితుడిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులను వేధించిన పోలీసు అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ను వెంటనే పదవి నుంచి తొలగించాలని గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బాధితురాలికి పూర్తి రక్షణ కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఒక విధమైన న్యాయం, సాధారణ ప్రజలకు మరో విధమైన న్యాయమా అని



ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై కూడా బీఆర్ఎస్వీ నేతలు విమర్శలు గుప్పించారు. నిందితుడిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. డీజీపీ కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులో ఉంచారు. ఆందోళనకారులను అడ్డుకునే క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు.

# ముఖ్యమంత్రిగా తొలి సంతకం




**200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు ఆమోదం**

**మహిళా భద్రత, ఉచిత బస్సు ప్రయాణంపై కూడా నిర్ణయాలు**

**విజయ్‌కు అభినందనలు తెలిపిన శ్రీలంక అధ్యక్షుడు**

**చెన్నై, మే 10**
తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సి. జోసెఫ్ విజయ్ తన ఎన్నికల హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేశారు. ఆదివారం ఉదయం చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఘన కార్యక్రమంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్‌తో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకున్న విజయ్, ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై వరుసగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు మహిళా భద్రతకు సంబంధించిన చర్యలు, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాలకు సంబంధించిన ఫైళ్లపై కూడా సంతకాలు చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర రాజకీయ నాయకులు హాజరయ్యారు. సినీ రంగ ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడాన్ని అభిమానులు భారీ స్థాయిలో సంబరంగా జరుపుకున్నారు. ఇదిలా ఉండగా, తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కు అనుర కుమార దిసానాయకే అభినందనలు తెలిపారు. శ్రీలంక, తమిళనాడు మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. భవిష్యత్తులో ఆర్థిక సహకారం మరింత బలపడాలని, భారత్–శ్రీలంక సంబంధాలు మరింత సన్నిహితంగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన విజయ్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై తొలి రోజునే దృష్టి పెట్టడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం సంకేతాలు ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సింధు ఆసుపత్రిని ప్రారంభించిన ప్రధాని మోదీ

**ఆరోగ్య రంగంలో కీలక ముందడుగని ప్రశంస**

**అత్యాధునిక సాంకేతికతపై ప్రధాని అభినందనలు**

**హైదరాబాద్‌లో వైద్య మౌలిక సదుపాయాలకు ఊతం**




**హైదరాబాద్, మే 10**
హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సింధు ఆసుపత్రిను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇది ఒక ప్రశంసనీయమైన ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, ఆసుపత్రి బృందాన్ని




అభినందించారు. అత్యాధునిక సాంకేతికతతో పాటు వినూత్న ఆవిష్కరణలను వైద్య సేవల్లో సమన్వయం చేయడంపై ఆసుపత్రి ప్రత్యేక దృష్టి పెట్టడం అభినందనీయమని తెలిపారు. సింధు ఆసుపత్రి ప్రారంభంతో హైదరాబాద్‌లో వైద్య సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అత్యాధునిక చికిత్సా సౌకర్యాలు, నిపుణుల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన సేవలు లభించే అవకాశముందని చెబుతున్నారు. ఇటీవల ఆరోగ్య రంగంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్య మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సింధు ఆసుపత్రి ప్రారంభం ప్రాధాన్యత సంతరించుకుంది.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది

**రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమన్న మోదీ**

**హెచ్ఐసీసీ వేదికగా పలు ప్రాజెక్టులకు శ్రీకారం**

**రేవంత్ రెడ్డిపై ప్రధాని సరదా వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మే 10**
రాష్ట్రాల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వచ్చిన ఆయన, హైదరాబాద్ హైటెక్‌సిటీలోని హెచ్ఐసీసీ వేదికగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై ప్రధాని సరదా వ్యాఖ్యలు చేశారు. "గత పదేళ్లుగా



గుజరాత్‌కే ఎక్కువ నిధులు ఇచ్చారని రేవంత్ రెడ్డి అంటున్నారు. అయితే గుజరాత్‌కు ఎంత ఇచ్చామో చెప్పాలని నేనే ఇప్పుడు రేవంత్ రెడ్డిని అడుగుతున్నా" అంటూ ఛలోక్తులు విసరడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. తెలంగాణ వికసిస్తే దేశం కూడా వికసిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. సైబరాబాద్ దేశ



అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని మోదీ అన్నారు. ఐటీ, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోందని కొనియాడారు. అనేక భారీ ప్రాజెక్టులకు కేంద్రంగా సైబరాబాద్ ఎదుగుతోందని చెప్పారు. అలాగే వరంగల్‌లో ప్రారంభించిన పీఎం మిత్ర పార్క్ టెక్స్‌టైల్ రంగంలో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. రైల్వే రంగంలో తెలంగాణకు గతంతో పోలిస్తే భారీగా నిధులు పెంచినట్లు ప్రధాని వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రైల్వే బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలు కూడా దక్కేవి కాదని, ప్రస్తుతం ఒక్క తెలంగాణకే రూ. 5,500 కోట్లకు పైగా కేటాయిస్తున్నామని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, తెలంగాణ కూడా దాని ప్రయోజనాలు పొందుతోందని పేర్కొన్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్–పనాజీ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి, కాజీపేట–విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు, కాజీపేట రైల్ అండర్ బైపాస్ లైన్, వరంగల్ పీఎం మిత్ర పార్క్, మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ గ్రీన్ ఫీల్డ్ టెర్మినల్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయంకు చేరుకున్న ప్రధాని మోదీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌తో పాటు పలువురు నేతలు ఘన స్వాగతం పలికారు. ప్రధాని పర్యటన సందర్భంగా నగరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.



# జనం మెచ్చేలా పురుష..

పవన్‌కల్యాణ్ బత్తుల హీరోగా పరిచయం అవుతున్న కమర్షియల్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పురుషః'. వీరు వులవల దర్శకుడు. బత్తుల కోటేశ్వరరావు నిర్మాత. సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్ కీలక పాత్రధారులు. ఈ నెల 22న సినిమా విడుదల కానున్నది.

ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సినిమా ద్వారా హీరోగా పరిచయం అవుతున్నందుకు హీరో పవన్‌కల్యాణ్ బత్తుల ఆనందం వెలిబుచ్చారు. నిర్మాత, సాంకేతికనిపుణుల సహకారం వల్లే ఈ కథను అనుకున్న విధంగా తీయగలిగానని, హీరో పవన్‌కల్యాణ్ బత్తుల అద్భుతంగా నటించాడని, తప్పకుండా తనకు మంచి పేరు వస్తుందని, అందరికీ నచ్చే సినిమా అవుతుందని దర్శకుడు వీరు వులవల చెప్పారు. ఇంకా నటీనటులు సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కమార్, హాసిని సుధీర్, విషిక కూడా మాట్లాడారు.

## 'పవన్ కల్యాణ్ పేరు వెనుక ఓ కథ ఉంది..

### భార్య ముందు బలాదూర్ అని చెప్పే ప్రయత్నమే పురుష :'

వీరు ఉలవల పవన్ కళ్యాణ్ హీరోగా డెబ్యూ ఇస్తున్న చిత్రం పురుష: ప్రతీ మగాడి యుద్ధం (విజయం) వెనుక ఓ ఆడది ఉంటుంది. స్వేచ్ఛ కోసం భర్త చేసే అలుపెరుగని పోరాటం.. అంటూ సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ మూవీలో సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రాన్ని మే 22న గ్రాండ్‌గా విడుదలచేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి సినిమా విశేషాలు పంచుకున్నారు. పాపులర్ యాక్టర్ సప్తగిరి మాట్లాడుతూ.. ఈ అబ్బాయి పవన్ కల్యాణ్ అనే పేరు పెట్టుకున్నాడు. దాని వెనుక ఒక కథ కూడా ఉంది. వీళ్ల నాన్న పవన్‌కల్యాణ్‌కు పెద్ద అభిమాని. తమ్ముడు సినిమా చూసిన తర్వాత ఈయన పుట్టాడు కాబట్టి.. పవన్‌కల్యాణ్ అభిమాని కాబట్టివాళ్లు నాన్న ఈ అబ్బాయికి పవన్‌కల్యాణ్ అనే పేరు పెట్టారన్నాడు. థియేటర్లకు జనాలు రావడమే కష్టమైన ఈ రోజుల్లో వాళ్ల అబ్బాయి మీద ప్రేమతో భారీ బడ్జెట్ పెట్టి మా అబ్బాయినిస్క్రీన్‌పై నేను హీరోగా చూడాలని ఎంతో ఇష్టపడి ఆయన కష్టపడి సంపాదించిన డబ్బును ఈ సినిమా కోసం పెట్టారు. ఈ పవన్ కల్యాణ్‌కు మంచి భవిష్యత్ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నాడు. ఉప్పుకర్పురంబు నొక్క పోలికనుండు.. చూడ చూడ రుచుల జాడవేరు.. పురుషులందు పుణ్య పురుషులు వేరయా.. విశ్వదాభిరామ వినుర వేమ అనే పద్యాన్ని చెప్పిన సప్తగిరి.. పురుషులందు పుణ్య పురుషులైనా. మహాబలులైనా. ధైర్యవంతులైనా.. గండరగండులైనా.. ఎలాంటి వారైనా సరే భార్య ముందు బలాదూర్ అని చెప్పే ప్రయత్నమే ఈ సినిమా అన్నాడు. ఈ రోజుల్లో సినిమా రావాలంటే ఆ డైరెక్టర్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ చేశాడని డైరెక్టర్‌కు పేరొస్తేనే జనాలు లోపలికి వస్తున్నారు. ఆ స్థితిలో ఉన్నాం కాబట్టి ఈ సినిమా మొత్తం మా వీరు ఉలవలపై ఆధారపడి ఉంది. ఆయన తప్పకుండా తన మార్క్‌ను చూపించే ప్రయత్నం చేశారు. మేం మొన్ననే సినిమా చూశామన్నాడు సప్తగిరి. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ మూవీ మొదలైనప్పుడు సప్తగిరి అన్నను, కసిరెడ్డి అన్నను లేదా బయట ఏదైనా సందర్భంలో ఎవరైనా సెలబ్రిటీని చూసినప్పుడు లైవ్‌లో చూశామన్నా ఫీలింగ్ వచ్చేది. అలాగే ఈ రోజు మీ అందరినీ లైవ్‌లో చూస్తున్నందుకు నాకు చాలా సంతోషంగాఉంది. పురుష మే 22న విడుదలవుతుంది. దానికి మీ అందరి సపోర్ట్ అయితే మాకు చాలా అవసరం. డైరెక్టర్ వీరు అన్న ఎక్కడా కూడా నేను కొత్తోడినన్న భయం క్రియేట్ చేయకుండా.. నేను బయట కూడా ఎక్కువ మాట్లాడే వాడిని కాదు.. డైరెక్టర్ నన్ను దాంట్లో నుంచి బయటకు తీసుకొచ్చి నన్ను ఎక్కడా కూడా ఇబ్బంది పడనీయకుండా చాలా ప్రేమగా సొంత తమ్ముడిని చూసుకున్నట్టు చూసుకొని ఈ సినిమా పూర్తి చేశారన్నాడు.

# చిత్రసీమలో విషాదం..

### రోడ్డుప్రమాదంలో హీరో, సినిమాటోగ్రాఫర్ దుర్మరణం..!



తెలుగు చిత్రసీమలో విషాదం నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు రోడ్డు ప్రమాదంలో హీరో భరత్ కాంత్, సినిమాటోగ్రాఫర్ త్రిలోక్ దుర్మరణం చెందారు. బొంగులూరు గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భరత్, త్రిలోక్ ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. నెల్లూరు నుంచి హైదరాబాద్ వస్తున్న వీరి కారును వెనకాల నుంచి కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు.జఞఎ డ ాశీఝ్రశ్రీ +బఱఅవం ఇటీవల విడుదలైన 'టాలెంట్ 'సినిమాలో హీరోగా నటించిన భరత్ కాంత్ పలు తెలుగు, హిందీ వెబ్ సిరీస్‌లోనూ నటించాడు. త్రిలోక్ సైతం టాలీవుడ్‌లో సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశాడు. అయితే.. దురదృష్టవశాత్తూ ఇద్దరూ కారులో నెల్లూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఔటర్ రింగ్ రోడ్డు ప్రమాదం జరిగింది. వీరి కారును కంటైనర్ వెనక నుంచి ఢీకొట్టింది. దాంతో, ఎంతో ఉజ్వల భవిష్యత్తున్న త్రిలోక్, భరత్ ప్రాణాలు కోల్పోయారు.

# ప్రభాస్ స్పిరిట్ కొత్త షెడ్యూల్ షురూ కానుందా..?




గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను ట్రాక్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్ (ాజూఅతీఙ). యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.తాజా రిపోర్ట్స్ ప్రకారం స్పిరిట్ కొత్త షెడ్యూల్ రేపు షురూ కానుందట. ప్రభాస్, వివేక్ ఒబెరాయ్ మధ్య వచ్చే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో షూట్ చేయనున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు సుమారు 2 నెలలపాటు సుదీర్ఘంగా ఈ షెడ్యూల్ కొనసాగనుందట. ఇందులో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్‌గా నటిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది. సందీప్ రెడ్డి వంగా హోం బ్యానర్ భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌తో కలిసి సంయుక్తంగా తెరకక్కిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రాణే సంగీతం అందిస్తున్నాడు. స్పిరిట్‌లో బాలీవుడ్ యాక్టర్ వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ (డాన్ లీ) మడాంగ్‌సియోక్ (మీఞఙశీఅస్త్రూవశీఎ) విలన్‌గా నటిస్తున్నాడని వార్తలు రాగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తే క్లారిటీ వచ్చే అవకాశముంది.

# మదర్స్ డే సందర్భంగా అరుదైన ఫొటోలు షేర్ చేసిన చిరంజీవి..



అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా సినీ ప్రముఖులు తమ తల్లులతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి కూడా భావోద్వేగభరిత సందేశంతో అభిమానులను ఆకట్టుకున్నారు. అమ్మ గొప్పతనం, త్యాగం గురించి హృదయాన్ని హత్తుకునేలా పేర్కొంటూ ప్రపంచంలోని తల్లులందరికీ మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మ... మన మొదటి గురువు, మన మొదటి ధైర్యం, కనిపించే దైవం కూడా 'కని పెంచిన' మాతృమూర్తి తర్వాతే. మన విజయాల వెనక త్యాగం... మన ప్రతి అడుగులోనూ నిశ్శబ్దంగా నిలిచే ఆశీర్వాదం అమ్మది. మనకంటే మనల్ని ఎక్కువగా ప్రేమించే ప్రతి మాతృమూర్తికి హృదయపూర్వక మాతృదినోత్సవ శుభాకాంక్షలు" అంటూ చిరంజీవి ఎమోషనల్ పోస్ట్ చేశారు. ఈ సందేశంతో పాటు తన కుటుంబానికి సంబంధించిన కొన్ని అరుదైన త్రోబ్యాక్ ఫొటోలను కూడా షేర్ చేశారు. ఆ ఫొటోలలో చిరంజీవి తల్లి అంజనా దేవి, తండ్రి వెంకట్రావు, అలాగే పవన్ కళ్యాణ్, నాగబాబు మరియు కుటుంబ సభ్యులు కనిపించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా మెగా అభిమానులు ఈ పిక్స్‌ను భారీగా షేర్ చేస్తూ ట్రెండ్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాతో చిరంజీవి కెరీర్‌లో మరో భారీ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఆయన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో కొత్త సినిమా చేయడానికి సిద్ధమవుతున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'కాకాజీ' అనే టైటిల్ పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.